క్లుప్తంగా

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాజట్ల ఎంపిక రేపు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల క్రీడాజట్ల ఎంపిక ఈనెల 3న చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమినేని సురేష్, ఆళ్ల రామమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు 2010 జనవరి 2వ తేదీ, ఆ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఎంపికైన జట్లు ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు చేవూరు సమీపంలోని రామదూత ఆశ్రమంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు పి.మురళి, ఎస్.సురేష్‌లను సెల్ నంబర్లు 9000391008 లేదా 9849429839 లను సంప్రదించాలన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 3న ఉదయం 10గంటలకు చేవూరు జెడ్పీ హైస్కూల్లో ధ్రువ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

జిల్లా మహిళా క్రికెట్ జట్ల ఎంపిక రేపు

ఒంగోలు: అండర్ 23, సీనియర్ మహిళా క్రికెట్ జట్ల ఎంపిక ఈనెల 3న స్థానిక మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఎంపికకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వారు మాత్రమే అర్హులు. ఎంపికైన జట్లు ఈనెల 14 నుంచి ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఆసక్తిగల క్రీడాకారులు తప్పనిసరిగా కలర్ డ్రస్, షూస్, సొంత కిట్, జనన ధ్రువీకరణ పత్రం (ఫారం-5) ఆధార్ కార్డు, అండర్ 23లో పాల్గొనేవారు తమ వెంట విద్యాసంస్థ జారీచేసిన స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పూర్తి వివరాలకు కోచ్‌లు యం.దమయంతి: 7893720221, బి.చంద్రశేఖర్: 9246222999 నంబర్లలో సంప్రదించాలన్నారు.

3న సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: సీనియర్ పురుష, మహిళా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక ఈనెల 3న ఉదయం 8.30కు స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కావూరి విన్సెంట్, అంచిపోగు రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 16, 17 తేదీల్లో విశాఖలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటాయన్నారు. పూర్తి వివరాలకు రోజర్ బిన్నీ: 9908822193, తాళ్లూరి విజయ్: 9030815900 నంబర్లను సంప్రదించాలన్నారు.

5 నుంచి జిల్లా స్థాయి ఆటల పోటీలు

ఒంగోలు: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు స్థానిక మినీ స్టేడియంలో 10 రకాల జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి జి.రాజరాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడాంశాలకు సంబంధించి పోటీలు ఉంటాయని, ఆసక్తిగలవారు ఈనెల 3వ తేదీలోపు జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 22 సంవత్సరాల్లోపు ఉండాలి. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాజట్లు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు గుంటూరులో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. జోనల్ స్థాయిలో విజేత జట్లు ఈనెల 16 నుంచి 20 వరకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9121106840ను సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్ల ప్రదానం

ఒంగోలు సిటీ: స్థానిక ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. కాలేజీ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సేవా దృక్పథాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. రాహుల్, చంద్ర మాధవ్, గాయత్రి, సుజాతలకు ఈ గౌరవాన్ని అందించినట్లు ప్రోగ్రాం అధికారి టి.రాజేంద్ర బాబు తెలిపారు. కార్యక్రమంలో నీలిమ, రవి తేజ, నిరూష, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి, జోసఫ్, పార్థసారధి, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ట్రాక్టర్ల పంపిణీ



ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, ఎంపీడీఓ

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు, పెదకొత్తపల్లి, గుండ్లాపల్లి, దొడ్డవరం గ్రామాల్లో చెత్త సేకరించడానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వి.జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది

మండల అభివృద్ధి అధికారి సురేష్‌బాబు

సంతనూతలపాడు (చీమకుర్తి): సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల అభివృద్ధి అధికారి సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్క ఉద్యోగి పరిపాలనకు సంబంధించిన విధులు, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. సమాచార హక్కు చట్టంపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండి అర్జీదారుడు అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో ఇవ్వాలని చెప్పారు. ప్రతిఒక్కరూ సచివాలయం పరిధిలోని ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రమణమ్మ, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతోనే రోగనిరోధక శక్తి



ఎండ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది



వెల్లంపల్లిలో మహిళలతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

మద్దిపాడు: ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలోని వెల్లంపల్లి, కీర్తిపాడు, దొడ్డవరప్పాడు అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు జ్యోతి, పద్మావతి, శివనాగరాజ పాల్గొని బాలింతలు, గర్భిణులనుద్దేశించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు బిడ్డకు వరమని తెలిపారు. ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఏడో నెల నుంచి అనుబంధ పోషకాహారం ఇవ్వాలని వారు సూచించారు. రెండు సంవత్సరాల పాటు తల్లిపాలు బిడ్డకు అందిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలే పట్టించడం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సంతనూతలపాడు సూపర్‌వైజర్ సావిత్రి తెలిపారు. శుక్రవారం ఎండ్లూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, జీవనజ్యోతిచ అంగన్‌వాడి టీచర్లు పద్మ, కస్తూరి, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

గోవిందు మృతి పార్టీకి తీరని నష్టం

● ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



చిన గోవిందు (ఫైల్)



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి

కురిచేడు: వైఎస్సార్ పార్టీ నాయకుడు బొరిగొర్ల చిన్న గోవిందు (55) మృతి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్న గోవిందు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆరోగ్యం క్షీణించి గురువారం రాత్రి ఆయన మృతి చెందారు. ఆ విషయాన్ని తెలుసుకుని శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం పడమర వీరాయపాలెంలోని చిన గోవిందు నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకుడని బూచేపల్లి పేర్కొన్నారు. పడమర వీరాయిపాలెం సర్పంచ్ బొరిగొర్ల శివలక్ష్మి తండ్రి చిన గోవిందు. ఈయన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు. మాజీ ఎంపీటీసీ, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఎమ్మెల్యే బూచేపల్లి వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నిమ్మకాయల రాజయ్య, ఎంపీటీసీ తాళ్లూరి ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సారెడ్డి నాగిరెడ్డి, సెక్రటరీ ముువ్వా శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పోకూరి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఊట్ల పోలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్ కుమార్, ప్రచార కమిటీ అధ్యక్షుడు ఇందూరి సుబ్బారెడ్డి, నాయకులు నుసుం ప్రతాప్‌రెడ్డి, ఆరుద్రారెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, తాటి చెంచయ్య, పాపయ్య, సాదం నాసరయ్య, బొమ్మనబోయిన ఆంజనేయులు ఉన్నారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ

కురిచేడు: మండలంలోని నాంచారపురం గ్రామనికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు జింకా మూర్తెయ్యను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. అనారోగ్యంతో ఉన్న ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనరు వైవీ సుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీధర్, అధికార ప్రతినిధి జి.లింగారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు సారెడ్డి నాగిరెడ్డి, అంకె గోపాలకృష్ణ, యూత్ అధ్యక్షుడు కానాల శివారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, నాయకులు నుసుం ఆరుద్రారెడ్డి, కండె గంగయ్య, ఎన్వీ నాగిరెడ్డి, పెండ్యాల గుర్నాథం ఉన్నారు.



మూర్తెయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

ఇదేనా స్వచ్ఛ సంకల్పం?



ఇళ్ల మధ్య ప్లాస్టిక్ వ్యర్థాలు

పుల్లలచెరువు: ప్రభుత్వం ప్రతి మూడో శనివారం స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలైతే ఇస్తోందిగానీ ఆచరణలో అమలు కావడం లేదు. పుల్లలచెరువు వైద్యశాల వద్ద దట్టంగా చెట్లు పెరగడంతో క్రిమికీటకాలు వార్డుల్లోకి వస్తున్నాయని రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి ఆవరణ చూసి ఇది వైద్యశాలేనా..అనే అనుమానం వచ్చే విధంగా ఉంది. పుల్లలచెరువులోని కమ్మవారిపల్లిలో ఇళ్ల మధ్య చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్లాస్టిక్ పేపర్లు చేరి పారిశుధ్యం అధ్వానంగా ఉంది. నిత్యం దోమలు వస్తుండటంతో అక్కడ నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఇలా..

డిబేట్‌లో ప్రథమ స్థానం

యర్రగొండపాలెం: సమాచార హక్కు చట్టం ఆవిర్భవించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన డిబేట్ పోటీల్లో స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.భరత్‌చంద్ర, ఎం.మహేష్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు



పొంగళ్లు చేస్తున్న మహిళలు

కురిచేడు: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పడమర గంగవరంలో మహిళలు పేరంటాళ్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ శివారులో వేంచేసి ఉన్న పేరంటాళ్లమ్మ చెట్టు వద్దకు మహిళలందరూ వెళ్లి పూజలు చేశారు. సామూహికంగా పొంగళ్లు చేసి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసం వచ్చినా ఇంతవరకు పైర్లు వేయలేదని, ఇకనైనా కరుణించి సకాలంలో వర్షాలు కురిసి పంటలు సాగు చేసి పండేలా చూడాలని కోరుకున్నారు.

రోడ్డంతా గోతులే!



అధ్వానంగా ఉన్న రామచంద్రాపురం - పిడతలపూడి రోడ్డు

చీమకుర్తి రూరల్: మండల పరిధిలోని రామచంద్రాపురం నుంచి పిడతలపూడి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అడుగడుగునా గుంతలతో నిండిపోయి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే నరకం కనిపిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణించేవారు గుంతల్లో పడి ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త రోడ్డు వేయకపోయినా కనీసం గుంతలను మట్టితోనైనా పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

● ఎంపీడీవో శ్రీకృష్ణ



గ్రామంలో చెత్తను తరలిస్తున్న ఎంపీడీవో, తదితరులు

కొత్తపట్నం: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో పి.శ్రీకృష్ణ అన్నారు. మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో తిరిగి పారిశుధ్యం పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీగా కె.పల్లెపాలెం ఎంపిక కాబడిందన్నారు. పారిశుధ్య సిబ్బంది రిక్షాతో వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కె.పల్లెపాలెం గ్రామానికి సంబంధించిన పాంప్లేట్లను ఆవిష్కరించారు. గ్రామంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లను శుభ్రం చేయించారు. గ్రామంలో అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం చల్లించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వేణు, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, రంగాయపాలెం పంచాయతీ కార్యదర్శి అల్లియ్య, కసుకుర్తి శ్రీను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మ వారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు

తాళ్లూరు: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని బొద్దికూరపాడు శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శ్రీ ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మణిద్వీప వర్ణనతో పాటు తొమ్మిది రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరి కాయలు కొట్టారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ పూజారులు వాసు, రమణయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ



సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు

యర్రగొండపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం ప్రారంభమైన వెంటనే వారు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధికి సభ్యులు ఆమోదం తెలిపిన తీర్మానాలకు ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఇప్పటి వరకు అడ్మినిస్ట్రేషన్ శ్యాంక్షన్ ఇవ్వలేదని, దీంతో మండలం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఎంపీడీవో కూటమి నాయకుడికి వత్తాసు పలుకుతూ ఆయన చెప్పు చేతుల్లో పనిచేస్తున్నాడని, మెజార్టీ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా ఉండేందుకు ఆమోదం తెలిపిన తీర్మానాలకు అడ్మినిస్ట్రేషన్ శ్యాంక్షన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ సంవత్సరం జనవరి 10వ తేదీన జరిగిన సమావేశంలో తీర్మానించి ఆమోదించిన 12 అంశాల్లో ఏ ఒక్క అంశాన్ని ఎంపీడీవో అమలు చేయలేదని, ఈ విషయంపై మండల పరిషత్ సమావేశంలో నిలదీస్తామన్న భయంతో ఆయన ఆ తర్వాత జరిగిన సమావేశాలకు హాజరు కాలేదని ఆరోపించారు. కొత్తపల్లి శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, పిల్లికుంట తండా నుంచి చెం కాలనీకి రోడ్డు వేసేందుకు రూ.5 లక్షలు, కొలుకుల ఎస్సీ పాలెం, మొగుళ్లపల్లె, తమ్మడపల్లె, గోళ్లవిడిపి వైపాలెంలోని ఉట్ల స్తంభాల వీధి, గురిజేపల్లి ఎస్సీ పాలెం, గుర్రపుశాల, ఇజ్రాయిల్‌పేటల్లో తాగునీటి కోసం బోర్లు ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ.23 లక్షలు, గంజివారిపల్లె నుంచి సాయిబాబా నగర్‌కు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, వీరభద్రాపురం జిల్లాపరిషత్ స్కూల్ నుంచి గంజివారిపల్లె రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసేందుకు సమావేశం తీర్మానించిందని, ఆ పనుల్లో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు జరగలేదన్నారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు ఎంపీడీవో జాప్యం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని, మండల అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు.